అమ్మచేతి స్పర్శలా..

- అంగన్‌వాడీల నిర్వహణ
- కార్పొరేట్ బడులకు దీటుగా వసతులు
- స్వచ్ఛందంగా తమ పిల్లలను చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ఒకప్పుడు అంగన్‌వాడీలు ఏదో నిర్వహించాలి కనుక నిర్వహిస్తున్నాం అన్నట్లు ఎలాంటి సౌకర్యాలు లేకుండా నడిపేవారు. నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీల నిర్వహణకు సరిపడినన్ని నిధులు కూడా ఇచ్చేవి కాదు. అందుకే అప్పట్లో అంగన్‌వాడీల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపేవారు కాదు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగినట్లే విద్యా రంగం.. దానికి అనుబంధంగా ఉన్న పలు రంగాలతో పాటు అంగన్‌వాడీలను కూడా అద్భుతంగా తీర్చిదిద్దారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. వారం పొడవునా చక్కటి మెనూ రూపొందించి బలవర్ధక ఆహారం అందిస్తున్నారు. అందుకే ఇప్పుడు అంగన్‌వాడీల్లో చేరికలు పెరిగాయి.

అల్లిపురం: గోడలపై రంగురంగుల అందమైన చిత్రాలు.. ఆకట్టుకునే ఆట బొమ్మల నేపథ్యంలో చిన్నారుల సందడి ఆ ప్రాంతానికి వన్నె తెస్తోంది. అదొక అంగన్‌వాడీ కేంద్రం. అయినప్పటికీ అది ఖరీదైన ప్లే స్కూల్‌ను తలపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత గతంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లా కాకుండా నూటికి నూరుశాతం మెరుగైన రీతిలో అవి నిర్వహింపబడుతున్నాయి. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటల నడుమ చదువు చెబుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ప్లే స్కూళ్లలో నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సమకూర్చుతుండటంతో చిన్నారులు ఆడుతూ పాడుతూ చదువుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం..



బొమ్మలు చూపిస్తూ పాఠాల బోధన..

ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలు ఇరుకు గదుల్లోను, అద్దె వాటాల్లోను నిర్వహించేవారు. గత ప్రభుత్వంలో మొక్కుబడిగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించేవారు. వాటిలో మౌలిక సదుపాయాలు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. దీంతో వాటి రూపురేఖలు మారిపోయాయి. విశాలమైన గదులు, గోడలపై చిన్నారులను ఆకట్టుకునే రంగు రంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా తయారయ్యాయి. అన్ని వసతులతో పక్కా భవనాలు నిర్మించి గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు.



అమ్మవారివీధిలో అంగన్‌వాడీ భవనం



పిల్లలతో ఆడుతూ పాడుతూ పాఠాలు బోధిస్తున్న కార్యకర్త

ముమ్మరంగా చేరికలు..

జూన్1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం ముమ్మరం చేసింది. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులతో వార్డుల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 'అంగన్‌వాడీ పిలుస్తోంది' అంటూ జన బాగీధారి కార్యక్రమం చేపడుతున్నారు.

అర్బన్ 2లో 27 అంగన్‌వాడీ కేంద్రాలు..

దక్షిణ నియోజకవర్గంలోని అర్బన్–2 సెక్టార్‌లో 27 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో సుమారు వెయ్యి మందికి పైగా పిల్లలున్నారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పొందుతున్నారు.

టీచర్లకు గౌరవం పెరిగింది..

ఒకప్పుడు అంగన్‌వాడీ సెంటర్లలో ఎటువంటి సౌకర్యాలు ఉండేవి కాదు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు తల్లిదండ్రులు విముఖత చూపేవారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో చక్కటి మౌలిక వసతులు ఏర్పడ్డాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను స్వచ్ఛందంగా ఈ కేంద్రాలకు పంపిస్తున్నారు. ఇప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు గౌరవం పెరిగింది.

రోజూ మెనూ ఇలా..

సోమవారం	అన్నం, దోశకాయ పప్పు, కోడి గుడ్డు కూర, ఉడికించిన గుడ్డు, ఉదయం అల్పాహారం, పాలు (200 ఎంఎల్)
మంగళవారం	అన్నం, టమాటా పప్పు, కోడి గుడ్డు కూర, ఉడికించిన గుడ్డు, ఉదయం అల్పాహారం, పాలు (200 ఎం.ఎల్)
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు, కోడి గుడ్డు కూర, ఉడికించిన గుడ్డు, ఉదయం అల్పాహారం, పాలు (200 ఎం.ఎల్)
గురువారం	ఎగ్ ఫ్రైడ్ రైస్, ఆకుకూర, సాంబారు, ఉడికించిన గుడ్డు, ఉదయం అల్పాహారం, పాలు. (పాలు 200 ఎం.ఎల్)
శుక్రవారం	అన్నం, బీరకాయ లేదా సొరకాయ, మునగాకు లేదా పాలకూరతో గుడ్డు కూర, పాలు (200 ఎం.ఎల్)
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు, ఉడికించిన కోడి గుడ్డు, పాలు (100 ఎం.ఎల్) అందజేస్తారు.

ప్రభుత్వ సహకారం బాగుంది..



అంగన్‌వాడీ కేంద్రాలకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది లేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు మంచి ఆహారం అందజేస్తున్నారు. ప్రతి వారం ఆరోగ్యం చెక్ చేస్తున్నారు.

– వి.కుమారి, అమ్మవారివీధి

క్లుప్తంగా

సర్వ రోగ నివారిణి యోగా

అల్లిపురం: యోగా సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు ముఖ్యమైన యోగాసనాలు, రెండు రకాల ప్రాణాయామాల గురించి వివరించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అమెరికాలో జరిగే యోగా దినోత్సవంలో 180 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఓంయోగా కేంద్రం ప్రతినిధి రమేష్, శాంతి యోగా కేంద్రం ప్రతినిధి సుబ్బారావు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు లలితాదేవి, వేణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణు నమస్కారం, దండ, అష్టాంగ, భుజంగ, పర్వత, అశ్వసంచార వంటి ఆసనాలు ప్రదర్శించారు.

కార్యకర్తకు కార్పొరేటర్ అండ

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం వార్డులో సీహార్స్ జంక్షన్ వద్ద ఉంటున్న పెంటకోట రామకృష్ణ అనే కార్యకర్త కూతురు లాస్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న విల్లూరి స్వయంగా వెళ్లి లాస్యకి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందే విధంగా సాయపడి ఆర్థిక సాయం కూడా చేశారు.

ఘాటెక్కిన అల్లం ధర



జగదాంబ: అల్లం ధర ఒక్కసారిగా ఘాటెక్కింది. గత నెల కిలో రూ. 100 ఉండే అల్లం ధర ఒకేసారి రూ. 250కి చేరుకుంది. దీంతో సామాన్యులు అల్లం వైపు చూడడానికి కూడా సాహసించడంలేదు. హోల్‌సేల్ మార్కెట్‌లో బ్లాక్ చేయడం వల్లే అల్లం ధర ఆకాశాన్ని అంటిందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే విధంగా అల్లం, టమాటా, ఉల్లి వంటి నిత్యావసరాలను బ్లాక్ చేసినప్పుడు విజిలెన్స్ అధికారుల దాడుల అనంతరం ధరలు దిగి వచ్చాయి. ఇప్పుడు కూడా అదే విధంగా అధికారులు దాడులు చేస్తే తప్ప బ్లాక్‌మార్కెట్‌లో ఉన్న అల్లం బయటికి వచ్చి.. ధరలు దిగి రావని పలువురు చెబుతున్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

డాబాగార్డెన్స్: పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న నిరసనలో పాల్గొనాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలని, సర్దుబాటు, ఇతర అక్రమ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సింహాచలం: అడవివరంలోని నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఆర్.ఆర్. కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం2గంటల వరకు నిర్వహించిన ఈశిబిరంలో 185 మంది రక్తదానం చేశారు. మదర్ బ్లడ్ బ్యాంక్, ఛత్రపతి బ్లడ్ సెంటర్, విశాఖ బ్లడ్ సెంటర్, అమ్మ బ్లడ్ బ్యాంక్‌లకు చెందిన వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, వినోద్, చైతన్య పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్ల కిరణ్‌బాబు, ఎన్. అప్పారావు, నవయువ సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ శిక్షణ

డాబాగార్డెన్స్: ఆదరణ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో మే 19 నుంచి నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని శిక్షణ పొందిన చిన్నారులను అభినందించారు. 30వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోన శంకర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన పిల్లలు ఉన్నతంగా రాణించాలని అభిలషించారు. కోచ్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, లహరి ఎంటర్‌ప్రైజెస్ అధినేత కుమార్, గణేష్, కృష్ణ, రెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలు ప్రారంభం



మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా 11వ మహా సభలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టి దేశంలో మత విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని అమలు చేయలేదన్నారు. ఎస్వీ యూనివర్సిటీ మాజీ లెక్చరర్ క్షేత్రపాల్ మాట్లాడుతూ దేశంలోయువత భవిష్యత్తు, ఉద్యోగ, ఉపాధి కోసం ఏఐవైఎఫ్ జెండా చేతపట్టి సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు అశోక్‌నగర్‌కు చెందిన ఈతలపాక ప్రసాద్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.30 వేల చెక్కును ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందించారు. కొద్ది నెలల క్రితం ఈతలపాక ప్రసాద్ గుండెకు బైపాస్ సర్జరీ జరిగింది. అయితే ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యం చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ప్రజాదర్బార్‌లో విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో సహాయనిధి నుంచి రూ. 30 వేల చెక్కు రాగా ఆదివారం అశోక్‌నగర్‌లో ఉన్న ప్రసాద్ ఇంటికి వెళ్లి చెక్కు అందేశారు. అలాగే తన సొంత నిధుల నుంచి రూ. 3 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈతలపాక విజయ్, అజయ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రథయాత్ర వీక్షణకు బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్

మహారాణిపేట : ఈనెల 20 నుంచి పది రోజుల పాటు జరగనున్న జగన్నాథ రథయాత్రలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆదేశించారు. ఆదివారం టర్నర్ చౌల్ట్రీ వద్ద గల దేవదాయ శాఖ కార్యాలయ ఆవరణలో దేవదాయ శాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, 1098 చైల్డ్ లైన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది ఉత్సవాల్లో ఎంత మంది బాలలు రథోత్సవాన్ని తిలకించారని దేవాలయ ఈవో రాజగోపాలరెడ్డిని ప్రశ్నించారు. అదే విధంగా వైద్య ఆరోగ్యశాఖ కూడా కిట్లు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కమిషన్ సూచనల ప్రకారం బాలలకు సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి రమణకుమారి, వైసీపీ నాయకుడు మాసిపోగు రాజు, దేవస్థానం ప్రధాన అర్చకుడు జగన్నాథ ఆచార్యులు, వివిధ సచివాలయాల కార్యదర్శులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యాభ్యాసంపై అవగాహన కోసం ఐవీ ఓవర్సీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2023కు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మందికి ఉన్నా.. ఎలా ప్రవేశం పొందాలి, ఏ విద్యా సంస్థలు మంచివి అనే అంశాలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌కు చెందిన 33 ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరై సుమారు 300 మంది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీ సంస్థ వ్యవస్థాపకులు బి.రామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, మార్కెట్ హెడ్ వెంకట రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జనరేషన్ యువ చిన్నారులకు వితరణ



ఆశ్రమ చిన్నారులతో శ్రీ మణికంఠ సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన శ్రీ మణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనరేషన్ యువ ఆశ్రమాన్ని సభ్యులు సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్న 24 మంది పిల్లలకు స్కూల్ షూస్ అందించారు. ఇందుకు అవసరమైన రూ.5,950 నగదులో సంఘ సభ్యులు వి.నాగేశ్వరరావు రూ.5000, మిగతా నగదును జి.శ్రీనివాసరావు, మణికంఠ సేవ సంఘం కలిసి అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు ఎం.రవికిరణ్, కార్యదర్శి ఆర్.గణపతిరావు, కోశాధికారి జీవీ ఆనందరావు, భాస్కరరావు, ఏఎస్ రావు, జీవీ మధుసూదనరావు, ఎస్.హరికుమార్, పి.పాపారావు, ఎస్‌వీఎల్‌ఎన్ స్వామి, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం



కోటవీధిలో కాలువలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. ఆదివారం వార్డులోని కోటవీధి, పెద్దవీధి, అబుసరంగా వీధుల్లో పర్యటించిన ఆయన గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయన్నారు. దీనివలన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డులోని కాలువలన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కనీసం మురుగునీరు కూడా బయటికి వెళ్లక ప్రజలు దుర్గంధం మధ్యనే జీవిస్తున్నారని అన్నారు. ఇటువంటి సమస్యలన్నీ వైఎస్సార్‌సీపీతోనే పరిష్కారం అవుతాయన్నారు. కార్పొరేటర్ నిధులతో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు సాధిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత భారత నిర్మాణమే లక్ష్యం



మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షిస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట : ప్రధాని మోదీ మనసులో మాట (మన్ కీ బాత్) 102వ ఎపిసోడ్‌ను మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో పలువురు వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచన ప్రకారం టీబీరహిత భారత నిర్మాణమే లక్ష్యమన్నారు. యోగాను మన దినచర్యలో భాగం చేసుకోవాలని తెలిపారు. మన్‌కీ బాత్ ద్వారా పిల్లలకు మన సంస్కృతి నేర్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. వెంకటరమణారావు, గౌరీ శంకర్, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, క్షీరాబ్దిదుతి, గేదెల శ్రీహరి, మంగ, రమణ, కొండమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట : విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891–2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట సుబ్బారావు

డాబాగార్డెన్స్ : అతి కిరాతకంగా హత్య కాబడిన ఉప్పాల అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల గౌడ సంఘం కన్వీనర్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన వెంకట సుబ్బారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, విజయనగరం, మన్యం జిల్లా, ఉత్తరాంధ్ర గౌడ సంఘం మహిళా కో ఆర్డినేటర్ యరకల భవానీ డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ వద్ద గల గౌడ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలులో ఉప్పాల అమర్నాథ్ గౌడ్‌పై జరిగిన దాడిలో పెట్రోలు పోసి కాల్చి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల సంఘం గౌరవ అధ్యక్షుడు, విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు మార్గాన రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏకుల మధు, మార్గాన చినబాబు, సుందరరావు, కొయ్య సత్యనారాయణ, జెర్రిపోతుల ప్రసాద్, మేరువ గణేష్, నిచ్చెనకోళ్ల వెంకట్రావు, అత్తిలి రామచంద్రప్రసాద్, నార్గాన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ఆదరించాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

డాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సాంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి. శైలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అల్లిపురం: బైక్ పార్కింగ్ విషయమై రేగిన గొడవ ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి దారితీసింది. బాధితుల సమాచారం మేరకు అంగటిదిబ్బలో మోహన్‌రావు అనే వ్యక్తి ఫ్లోర్‌మిల్ నిర్వహిస్తున్నాడు. గత రాత్రి అదే ప్రాంతానికి చెందిన సారిపిల్లి సాయి అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఫ్లోర్‌మిల్ ముందు నిలిపాడు. దానిని ఫ్లోర్ మిల్ నిర్వాహకుడు అడగటంతో గొడవ జరిగింది. తరువాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిందితుడు అక్కడికి వచ్చి మరలా మోహన్‌రావుతో గొడవపడ్డాడు. ఈ సందర్భంగా నిందితుడు మోహన్‌రావు మెడపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న మహారాణిపేట పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐ రమణమూర్తిని వివరణ కోరగా వివరాలు చెప్పేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. పైగా అది చిన్న గొడవ అని చెప్పారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు. ఆలయ సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.